

## నేడు స్కూళ్లకు సెలవు

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1:** జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు డీఈవో శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు పడుతుండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించామన్నారు. అలాగే జిల్లాలోని అన్ని యజమాన్యాల జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో ఎస్వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. సెలవు ప్రకటించిన అంశాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మండల, విద్యా శాఖ అధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు.

# గొంతు తడవలే..!



ఇది నీటి గుంత అనుకుంటే తప్పులో కాలేసినట్లే. పది వేలకు పైగా జనాభా కలిగిన మండల కేంద్రం కోసిగిలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'జల్ జీవన్ మిషన్' కింద రూ.1.74 లక్షలు నిధులు ఇచ్చింది. 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంలో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడంతో ఇదిగో ఇలా రెండు ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణం పునాది గుంతల వద్దే ఆగిపోయింది.

- పల్లెసీమల్లో ఇంటింటికీ కనెక్షన్ ఉత్తిదే..
- రాష్ట్ర వాటా నిధులు ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- బిల్లులు రావనే భయంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- కొళాయి కనెక్షన్లు ఇవ్వకుండానే రికార్డుల్లో నమోదు
- నీరుగారిన జల్ జీవన్ మిషన్ పథకం

కర్నూలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

**గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం గ్రామీణ ప్రజలకు శాపంగా మారింది. పల్లె జనం గొంతు తడపాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్' పథకం నీరుగారింది. జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద రెండు విడతల్లో 1,027 పనులకు రూ.531.69 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఇంటింటికి కుళాయి కనెక్షన్ వస్తుంది.. తాగునీటి కష్టాలు తీరుతాయని గ్రామీణులు ఆనందించారు. పల్లెజనం జనం సంతోషంపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం నీళ్లు చల్లింది. రాష్ట్రం ఇవ్వాల్సిన వాటా నిధులు సకాలంలో ఇవ్వకపోవడం.. కేంద్రం ఇచ్చే నిధులను కూడా సక్రమంగా సద్వినియోగం చేసుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. చేసిన అరకొర పనులకు రూ.21.17 కోట్ల బకాయిలు పెట్టారు. 2.22 లక్షల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చామని రికార్డులో చూపినా.. ఆ లెక్కల్లో మాయాజాలం ఉందని ఇంజనీర్లే అంటున్నారు.**

జిల్లాలో కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 484 గ్రామ పంచాయతీలు, 50 మజరా గ్రామాలు ఉన్నాయి. జనాభా 17.50 లక్షలు ఉంటుందని అంచనా. గ్రామీణ ప్రజల దాహం తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు పేరిట ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నా ఇప్పటికీ పలు గ్రామాల్లో తాగునీరు అందని పరిస్థితి. దీంతో వేసవిలో దాహం తీర్చుకోవడం కోసం పల్లెజనం పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఈ కష్టాలు తీర్చాలనే సంకల్పంతో ప్రధాని మోదీ సారథ్యంలో గత ఎన్డీఏ ప్రభుత్వం 'జల్ జీవన్ మిషన్' పథకం చేపట్టింది. 2024 నాటికి దేశంలోని ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నది లక్ష్యం. వాటర్ మేనేజ్‌మెంట్, నీటి సంరక్షణ, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ద్వారా రీచార్జ్, పునర్వినియోగం, సోర్స్ సస్టైనబిలిటీ వంటి పనులు కూడా ఈ పథకం కింద చేపడతారు. జిల్లాలో 25 మండలాల్లో జల్ జీవన్ మిషన్ కింద రూ.531.69 కోట్లతో 1,026 పనులు చేపట్టారు. దశాబ్దాలుగా వెంటాడుతున్న కరువు పల్లెల్లో తాగునీటి కష్టాలు తీరుతాయని గ్రామీణులు ఆశించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం.. రాష్ట్రం వాటా నిధులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా ఆగిపోయాయి.

### చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

జిల్లాలో 2021-22, 2022-23లో జల్ జీవన్ మిషన్ కింద రూ.531.69 కోట్లతో 1,026 పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. అందులో 398 పనులు చేపట్టగా 293 పనులు పూర్తయ్యాయని, 79 పనులు వివిధ దశల్లో ఉన్నాయని ఇంజనీర్లు పేర్కొన్నారు. 26 పనులకు పునాదులు కూడా తీయలేదు. రూ.60.21 కోట్లు ఖర్చు చేయగా రూ.21.17 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేయలేదు. రూ.165.71 కోట్లతో చేపట్టాల్సిన 499 పనుల విషయంలో కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో వాటి అగ్రిమెంట్ రద్దు చేశారు. గత జగన్ ప్రభుత్వం రాష్ట్రం వాటా నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చినట్టు తెలుస్తోంది. అయితే.. ఆ పనులకు 2023-24లో ప్రభుత్వం మళ్లీ పరిపాలన అనుమతులు ఇచ్చింది.

### కనెక్షన్లు ఇవ్వకున్నా ఇచ్చినట్టు నమోదు..

జిల్లాలో గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఇంజనీర్ల లెక్కల ప్రకారం 484 గ్రామ పంచాయతీల పరిధిలో 3,45,790 నివాసాలు ఉన్నాయి. జల్ జీవన్ మిషన్ లక్ష్యం ప్రకారం ప్రతి ఇంటికీ (వంద శాతం) కొళాయి కనెక్షన్లు ఇవ్వాలి. ప్రధాన పైపులైన్లు, డిస్ట్రిబ్యూటరీ పైపులైన్లు, బోరు, విద్యుత్ మోటర్, ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మాణం వంటి పనులు చేపట్టాలి. జిల్లాలో 2,22,765 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చామని, 64.42 శాతం పురోగతి సాధించామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రికార్డుల్లో చూపుతున్నారు. అయితే ఈ లెక్కల్లో మాయ ఉందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇంజనీర్లు కూడా అంగీకరిస్తున్నారు. 2021 తరువాత కేంద్ర ప్రభుత్వం కేటాయించిన జల్ జీవన్ మిషన్ నిధుల్లో ఏపీ ఒక్క పైసా వాడుకోలేదని, 2021-22లో రాష్ట్రం చెల్లించాల్సిన వాటా నిధులు కూడా ఇవ్వలేదని అప్పట్లో కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర షెకావత్ వెల్లడించారు. దీంతో అప్రమత్తమైన అనాటి వైసీపీ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌పై పురోగతి సాధించాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దీంతో పురోగతి కోసం కొళాయి కనెక్షన్లు ఇవ్వకపోయినా ఇచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో రికార్డులు నమోదు చేశారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకే ఆన్‌లైన్‌లో అంకెలు ఎక్కువ చూపామని, నిధులు దుర్వినియోగం చేయలేదని ఓ ఇంజనీరు పేర్కొనడం కొసమెరుపు. జల్ జీవన్ మిషన్ పనుల్లో భారీ ఎత్తున అవినీతి జరిగిందని, చేయని పనులను బిల్లులు చేసి నిధులు స్వాహా చేశారంటూ జూలై 19న జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఏకరువు పెట్టారు. నిధుల దుర్వినియోగంపై విచారణ చేయిస్తామని కలెక్టరు పి.రంజిత్‌బాషా స్పష్టమైన హామీ ఇచ్చినా చర్యలు శూన్యం.

| మొత్తం నివాసాలు, జల్ జీవన్ మిషన్ కింద ఇచ్చిన కొళాయి కనెక్షన్లు | | | |
|---|---|---|---|
| నియోజకవర్గం | నివాసాలు | కొళాయి కనెక్షన్లు | శాతం |
| ఆదోని | 26,052 | 14,696 | 56.41 |
| ఆలూరు | 77,060 | 44,967 | 58.35 |
| ఎమ్మిగనూరు | 47,142 | 27,648 | 58.65 |
| మంత్రాలయం | 55,137 | 28,167 | 51.09 |
| పాణ్యం | 23,146 | 18,896 | 81.64 |
| కోడుమూరు | 49,725 | 40,954 | 82.36 |
| పత్తికొండ | 67,527 | 47,437 | 70.25 |
| మొత్తం | 3,45,790 | 2,22,765 | 64.42 |



మద్దికెరలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ కింద రూ.1.27 కోట్లు మంజూరు చేసింది. గత జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఇలా అసంపూర్తిగా ఆగిపోయింది. ఒక్క ఇంటికి కూడా కుళాయి కనెక్షన్ ఇవ్వలేదు.

### పల్స్ సర్వేకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం కొలుదీరగానే ఇంటింటి కొళాయి కనెక్షన్ల లెక్క తేల్చేందుకు ముందుకు కదిలింది. ఇందులోభాగంగానే ఇంటింటి సర్వే (పల్స్ సర్వే) చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల జారీ చేశారు. 2019 వరకు గ్రామాల్లో ఉన్న కొళాయి కనెక్షన్లు ఎన్ని, 2019-2024 వరకు గత వైసీపీ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కింద ఇచ్చిన కొళాయి కనెక్షన్లు ఎన్ని..? ఇప్పటికీ కుళాయి కనెక్షన్లు లేని ఇళ్లు ఎన్ని ఉన్నాయి.. తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే పూర్తయితే జగన్ ప్రభుత్వంలో జల్ జీవన్ మిషన్‌లో చేసిన కొళాయి కనెక్షన్ల మాయాజాలం వెలుగు చూసే అవకాశం లేకపోలేదు.



గోనెగండ్లలో జల్‌జీవన్ మిషన్ కింద నిర్మాణం చేపట్టిన ఓహెచ్ఆర్ ట్యాంక్ ఇది. ఈ గ్రామానికి రూ.3.51 కోట్లు మంజూరయ్యాయి. నాలుగు ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా.. ఒకటి మాత్రమే పనులు మొదలు పెట్టారు. అది కూడా గత ప్రభుత్వం అలసత్వం వల్ల అసంపూర్తిగా ఆగిపోయింది.



గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఎస్ఈ కార్యాలయం

| నియోజకవర్గాల వారిగా జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు, పూర్తైనవి, చేసిన ఖర్చు రూ.కోట్లలో | | | | | |
|---|---|---|---|---|---|
| నియోజకవర్గం | మంజూరైన పనులు | అంచనా రూ.కోట్లలో | చేపట్టిన పనులు | పూర్తైన పనులు | చేసిన ఖర్చు రూ.కోట్లలో |
| ఆదోని | 51 | 86.98 | 26 | 17 | 3.40 |
| ఆలూరు | 241 | 63.60 | 41 | 38 | 6.19 |
| ఎమ్మిగనూరు | 106 | 74.80 | 37 | 19 | 5.38 |
| మంత్రాలయం | 180 | 110.66 | 65 | 49 | 7.57 |
| పాణ్యం | 73 | 28.95 | 63 | 45 | 10.98 |
| కోడుమూరు | 148 | 79.70 | 47 | 23 | 5.46 |
| పత్తికొండ | 227 | 86.98 | 119 | 102 | 21.23 |
| మొత్తం | 1,026 | 531.69 | 398 | 293 | 60.21 |

## సుంకేసుల డ్యామ్ భద్రతపై ఆందోళన వద్దు

మంత్రి టీజీ భరత్



**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 1:** సుంకేసుల డ్యామ్ భద్రతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం విజయవాడ నుంచి కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుంకేసుల డ్యామ్ వద్ద కుంగిన మట్టి కరకట్టను పూడ్చేందుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సుంకేసుల డ్యామ్ భద్రతకు ఎలాంటి అటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరద ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రజలకు సహాయ చర్యలు అందించడంలో పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించామని చెప్పారు.

# జోరు వాన

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు



వెలుగోడు మండలంలో మునిగిన పంట చేలు



నంద్యాల పట్టణ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది



ఆత్మకూరులోని రంగ మహల్ థియేటర్ వద్ద నేలకూలిన వేప చెట్టు

**నంద్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)/ఆత్మకూరు:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఆదివారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పలు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కురిసిన వర్షపాతాన్ని పరిశీలిస్తే కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 26.8 మి.మీ నమోదైంది. అత్యల్పంగా బేతంచర్లలో 1.2 మి.మీ. వర్షం కురిసింది. కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నంద్యాల శివారులోని దళితవాడ, భీమవరం వెళ్లే దారిలో ఉన్న మద్దిలేరు వాగు ఉప్పొంగి ప్రవహించింది. పాములపాడు మండలంలో వాగులు, వంకలు ఉప్పొంగి సమీప గ్రామాల్లోకి వర్షపు నీరు చేరింది. పాములపాడు, చెలిమిళ్ల మధ్యలోని భవనాశి, ఎద్దులవంక వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. బండిఆత్మకూరు మండలంలోని మద్దిలేరు వాగు, జుర్రాగు, రాళ్ల వాగు, రాధావంక, జళ్ల వాగులు పొంగిపొర్లి ప్రవహిస్తున్నాయి. దీంతో బండిఆత్మకూరు, శింగవరం, సోమయాజులపల్లె, ఓంకారం మధ్య రాకపోకలు ఆగిపోయాయి. అలాగే జీసీ పాలెం వద్ద తెలుగుగంగ కాలువ ఉధృతంగా ప్రవాహిస్తుండంతో నారాణపురం, శింగవరం, లింగాపురం గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పెద్దదేవళాపురం, బండిఆత్మకూరు జగనన్న కాలనీని వరద నీరు చుట్టుముట్టింది. రుద్రవరం మండలంలో వక్కిలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. కొత్తపల్లి మండలం శివపురం, లింగాపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగు ఉధృతిగా ప్రవహిస్తుండటంతో పది గ్రామాలకుపైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని దుద్యాల, నందికుంట, శివపురం, కొక్కెరంచ, ముసలిమడుగు, లింగాపురం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### కుండపోత

**కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 1:** మూడు రోజులుగా వర్షాలు కుండపోతగా కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి మొదలుకుని శని, ఆదివారాల్లో విరామం లేకుండా వర్షం కురుస్తోంది. ఏకధాటి వానలతో పంటలన్నీ నీట మునిగాయి. టమోటా, ఉల్లితోపాటు కూరగాయల పంటలన్నీ తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. పత్తి, వేరుశనగ, ఆముదం, కంది తదితర పంటలన్నీ వర్షం ధాటికి నేలకూలాయి. ఆదివారం ఉదయం పది గంటలకు జిల్లా అంతటా 9.6 మి.మీ. సగటు వర్షపాతం నమోదైందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. నీట మునిగిన పంటలను కాపాడేందుకు, పంట నష్టాన్ని లెక్కించేందుకు వ్యవసాయ శాఖ యంత్రాంగం గ్రామాల్లోకి అడుగు పెట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హంద్రీకి వరద నీరు వచ్చి చేరింది.



ఉప్పొంగిన భవనాశి నది

## నిండు కుండలా తుంగభద్ర డ్యాం

తుంగభద్ర జలాశయం →



తీర ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు

**హాలహర్వి, సెప్టెంబరు 1:** రెండు రాష్ట్రాల జీవనాడి తుంగభద్ర జలాశయం మళ్లీ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. గత 20 రోజుల క్రితం 19వ గేటు కొట్టుకుపోవడంతో భారీగా జలాశయం నీరు వృథా అయింది. సాగునీటి ప్రాజెక్టుల సలహాదారు కన్నయ్య నాయుడు కృషి వల్ల ఆ గేటును విజయవంతంగా మూసేశారు. దీంతో మళ్లీ వరద పోటెత్తడంతో తుంగభద్ర ప్రస్తుతం 96.868 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో 40 వేల క్యూసెక్కుల మేర కొనసాగుతోంది. దీంతో తుంగభద్ర బోర్డు అధికారులు నదితీర ప్రాంతాలను అప్రమత్తం చేశారు. 24 గంటల్లో ఎప్పుడైనా గేట్లు ఎత్తి నదికి నీటిని విడుదల చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

## బాలికపై వైసీపీ కార్యకర్త అత్యాచారయత్నం..!

### దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన తల్లి, గ్రామస్తులు


ప్రభుదాసు అవుకు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

**అవుకు, సెప్టెంబరు 1:** ఓ బాలికపై వైసీపీ కార్యకర్త అత్యాచారానికి యత్నించిన సంఘటన నంద్యాల జిల్లా అవుకు మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులు గమనించడంతో బాలిక సురక్షితంగా బయటపడింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మోపూరి ప్రభుదాసు వైసీపీలో క్రియాశీలక కార్యకర్తగా ఉన్నాడు. ఆయన భార్య గతంలో ఎంపీటీసీగా వైసీపీ మద్దతుతో పోటీచేసి ఓడిపోయింది. ప్రస్తుతం ప్రభుదాసు కోవెలకుంట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలకు బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలిక కోవెలకుంట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. బాలిక రోజూ ప్రభుదాసు నడిపే బస్సులోనే పాఠశాలకు వెళ్లి వచ్చేది. దీంతో అతడి కన్ను బాలికపై పడింది. ఆదివారం సెలవు దినం కావటంతో బాలిక ఇంట్లోనే ఉండిపోయింది. బాలిక తల్లిదండ్రులు ఉదయాన్నే పొలం పనులకు వెళ్లిన విషయాన్ని తెలుసుకున్న ప్రభుదాసు విద్యార్థిని ఇంట్లోకి చొరబడ్డాడు. బాలికతో అనుచితంగా వ్యవహరిస్తూ అత్యాచారానికి యత్నించాడు. ఇదే సమయంలో పొలం పనులకు వెళ్లిన విద్యార్థిని తల్లి ఇంటికి వచ్చింది. ఇంటిలోపలి నుంచి కూతురు కేకలు వినిపించడంతో పరుగున వెళ్లింది. జరుగుతున్న ఘటనను చూసి కేకలు వేసి, చుట్టు పక్కల వారిని పిలిచింది. అందరూ కలిసి నిందితుడు ప్రభుదాసును పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుకు ఎస్‌ఐ రాజారెడ్డి వెల్లడించారు.

## డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 1:** రాయలసీమ యూనివర్సిటీలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు విడుదల చేశారు. గత నెలలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి 1 సెమిస్టర్‌కు 55కు 46, 2వ సెమిస్టర్‌కు 125కు 94, 3వ సెమిస్టర్‌కు 53కు 48, 4వ సెమిస్టర్‌కు 67కు 59, 5వ సెమిస్టర్‌కు 1012కు 923, 6వ సెమిస్టర్‌కు 53 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 46 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, మరిన్ని వివరాలకు వర్శిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

# అధికారులు కావలెను..!



**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 1:** నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రధానమైన పోస్టులలో అధికారులు లేకపోవడంతో పాలన గాడితప్పుతోందని చెప్పవచ్చు. కమిషనర్‌గా ఉన్న ఏ. భార్గవతేజ గత నెల గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో అడిషనల్ కమిషనర్ పివి. రామలింగేశ్వర్‌కు అదనపు కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి కమిషనర్ పోస్టు ఖాళీగానే ఉంది. అయితే ఇటీవల ప్రకాశం జిల్లా కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరిని కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పుడో..ఇప్పుడో కమిషనర్‌గా బాధ్యతలు తీసుకుంటారని భావించిన తరుణంలో ఆమెను చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఇక చేసేదేమి లేక నాన్ ఐఏఎస్ రవీంద్రబాబును కమిషనర్‌గా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు రెండు నెలల పాటు అడిషనల్ కమిషనరే ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమాదేవిని కొందరు కార్పొరేటర్లు బలవంతంగా బదిలీపై వెళ్లేలా చేసి తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. ఈ క్రమంలో వెంకటశివారెడ్డిని గత సంవత్సరం డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. అయితే ఆయనను మాతృసంస్థకు బదిలీ చేశారు. ఈ క్రమంలో సుమారు మూడు నెలలపాటు డీసీ పోస్టు ఖాళీగానే ఉండేది. ఈ తరుణంలో మళ్లీ ఆయననే ఇక్కడికి నియమించారు. వచ్చిన నెలకే పదవీ విరమణ చేయడంతో సుమారు ఏడు నెలల నుంచి ఆ పోస్టుకు ఎవ్వరినీ నియమించలేదు. ప్రధానంగా పారిశుధ్య విభాగాన్ని పర్యవేక్షించాల్సిన డీసీ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆ విభాగం గాడి తప్పింది.

- పట్టణ ప్రణాళికా విభాగంలో గత సంవత్సరం సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మీనాకుమారిని నియమించారు. ఆమె కేవలం రెండు నెలలు మాత్రమే చేసి వ్యక్తిగత సెలవులో వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడే డిప్యూటీ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌కుమార్‌కు సీపీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు రావడంతో సెలవు పెట్టుకుని...అక్కడి నుంచి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీపై వెళ్లారు. దీంతో కుడాలో పని చేస్తున్న డీసీపీ సంధ్యారాణిని నగర పాలక సంస్థకు కేటాయించారు. టౌన్ ప్లానింగ్

**● గాడి తప్పుతున్న నగర పాలక సంస్థ కార్యాలయం**

**● ఇష్టారాజ్యంగా ఉద్యోగులు**

సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న హరీష్‌కుమార్ చౌదరి కూడ రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేక అనంతపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి డిప్యుటేషన్ ప్రాతిపదికన వెళ్లారు. ఇక్కడే పని చేస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ హయత్ మోహిద్దీన్ కర్నూలు కుడాకు వెళ్లారు. మరో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రాధాకృష్ణపై అవినీతి ఆరోపణలు రావడంతో అతనిని మాతృసంస్థకు సరెండర్ చేశారు.

- ఇంజనీరింగ్ విభాగంలో ఓ డీఈ పోస్టు ఖాళీగా ఉంది. ఆయ నపై ఆరోపణలు రావడంతో ఈఎన్‌సీ కార్యాలయంలో రిపో ర్టు చేసుకోవాలని అప్పటి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వివిధ శాఖలలో పదవీ విరమణ పొందిన స్థానంలో జూనియర్ అసిసెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఇన్‌చార్జిలు గా బాధ్యతలు అప్పచెప్పి విధులు నిర్వహించే విధంగా చేస్తున్నారు. పాలక మండలి సభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి వెంటనే ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- నగర పాలకలోని కొన్ని విభాగాలలో అవినీతికి హద్దులేకుండా పోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అందినకాడికి దోచుకున్నారు. ఏ విభాగంలో పనులు కావాలన్నా ప్రజలు మామూళ్లు ముట్టచెప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. లేనిపక్షంలో ఎక్కడి ఫైల్ అక్కడే నిలిచిపోతుంది. కొందరు అధికారులు, ఉద్యోగులు పని చేయకుండా ఆలస్యం చేస్తూ ప్రజలను వేధిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీరికి తోడుగా సచివాలయ ఉద్యోగులు కూడా మామూళ్ల మత్తులో తూగుతున్నారు. అందుకు నిదర్శనమే కొన్ని సచివాలయాల పరిధిలో అక్రమ లేఅవుట్లు గుర్తించి వాటికి ఇటీవల కమిషనర్ నోటీసులు కూడ జారీ చేశారు. గృహ నిర్మాణంలో జరిగే వాటిని ఆపకుండా వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## గణేశ్ ఉత్సవాలకు సింగిల్ విండో విధానం

### ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించిన ప్రభుత్వం

**కర్నూలు, సెప్టెంబరు 1:** ఈ ఏడాది గణేశ్ ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానం రూపొందించారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంది. విగ్రహాల ఏర్పాటుకు మరో ఆరు రోజులే గడువు ఉండటంతో అనుమతుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు కొత్త తరహా విధానాన్ని తీసుకు వచ్చింది.

**అనుమతుల ప్రక్రియ ఇలా:**

గణేష్ ఉత్సవాలకు Http-s://ganeshutsav.net వెబ్‌సైట్‌లో ఈ అనుమతుల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అలాగే చాట్‌బట్ సేవలకు 7995095800 మొబైల్ నెంబర్‌ను కేటాయించారు. నిర్వాహకులు మొబైల్ నెంబర్‌కు 'ఏజీ' అని సందేశం పంపిస్తే ఎన్‌వోసీ పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం మీ వాట్సాప్‌కు వస్తుంది.

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి**

గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అందరూ సహకరించాలి. విగ్రహాల ఏర్పాటు అనుమతి ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. నిర్వాహకులు కచ్చితంగా అనుమతి పత్రాలు, క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచుకోవాలి. శాంతిభద్రతలు, మతపర ఘర్షణలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. - బిందు మాధవ్, ఎస్పీ

## విద్యార్థి ఆత్మహత్య

### ఫ్రీ ఫైర్ గేమ్ ఆడొద్దని మందలించినందుకు..

**కర్నూలు, సెప్టెంబరు 1:** తరచూ సెల్‌ఫోన్‌లో ఫ్రీ ఫైర్ గేమ్ ఆడుతుంటే.. తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బబ్లూ అలియాస్ రాహుల్ (14) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన రమేష్, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు సంతానం. రమేష్ టైలరింగ్ పని చేస్తున్నాడు. ఈశ్వరమ్మ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నారు. పెద్దకొడుకు వంశీకృష్ణ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చిన్న కొడుకు రాహుల్ ప్రైవేటు స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సెల్‌ఫోన్‌లో ఫ్రీఫైర్ గేమ్ ఆడుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాహుల్ తండ్రి నిర్వహిస్తున్న నక్షత్ర టైలరింగ్ షాపు వద్దకు వెళ్లి తండ్రి ఇంటికి వెళ్లగానే ఉరి వేసుకున్నాడు. తండ్రి రమేష్ భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి కొడుకు విగతజీవిగా కనిపించాడు. రాహుల్‌ను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు రావు తెలిపారు.

## దళితులు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి

- సమష్టిగా ఉంటేనే లక్ష్యాన్ని చేరుకుంటాం
- ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నేత కృష్ణారావు

**కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 1:** ఉన్నతమైన పదవుల్లో ఉన్నా సరైన గౌరవాన్ని పొందలేకపోతున్న దళితులు తమ ఆత్మగౌరవాన్ని కాపడుకోడానికి ఉద్యమించాలని ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ కోఆర్డినేటర్ డా.సీహెచ్ కృష్ణారావు అన్నారు. ఇటీవల నంద్యాల జిల్లా పశువైద్యశాఖ అధికారి పై కులవివక్షతో జరిగిన దాడిని ఏపీ పశుసంవర్ధకశాఖ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు తీవ్రంగా ఖండించారు. కర్నూలు నగరంలోని ప్రైమ్ ల్యాండ్ హోటల్‌లో ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దళిత ఆత్మగౌరవ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గత నెల 28న నంద్యాల జిల్లా పశువైద్యశాఖ అధికారి కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లాలకు చెందిన పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు మూకుమ్మడిగా ముట్టడించి దాడి చేయడం దారుణమని అన్నారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా దళిత ఉద్యోగులను అవమానించడమేనని ఆయన అన్నారు. నీతి నిజాయితీతో పని చేస్తున్న జిల్లా అధికారి మీద ఆరోపణలు చేయడం దారుణమని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.నాగరాజు మండిపడ్డారు.

## అండర్-23 జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

- రాష్ట్ర పరిశీలకుడు సురేష్


మాట్లాడుతున్న సురేష్

**కర్నూలు (స్పోర్ట్స్), సెప్టెంబరు 1:** ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా జాతీయ స్థాయిలో అండర్-23 విభాగంలో మహిళల పురుషుల విభాగంలో పోటీలు నిర్వహిస్తారని ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పరిశీలకులు సురేష్ వెల్లడించారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీలైనంత త్వరలో 26 జిల్లాల్లో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పరిశీలకులు బి. రామాంజనేయులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి కాశీపతిరావు పాల్గొన్నారు.

## 4న జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 1:** జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 4న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడవ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 10.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 10.30 నుండి 11.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 11.00 గంటల నుండి 11.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 11.30 నుంచి 12.00 గంటల వరకు 4వస్థాయి సంఘం, 12.00 నుంచి 12.30 వరకు 5వ స్థాయి సంఘం, 12.30 నుంచి 1.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

## పంట నష్టంపై సర్వే

- నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాం
- జాయింట్ కలెక్టర్ నవ్య


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

**గోనెగండ్ల/ఎమ్మిగనూరు, సెప్టెంబరు 1:** జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య తెలిపారు. ఆదివారం గోనెగండ్ల, గంజహళ్లి, వేముగోడు, పుట్టపాశం, హెచ్ కైరవాడి గ్రామాల పరిధిలోని వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఎంత నష్టం వస్తుందని వేరుశనగ సాగు చేసిన రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు బుడ్డప్ప, హసన్ మాట్లాడుతూ మూడు ఎకరాలకు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టామని, భారీ వర్షాల వల్ల పంట మొత్తం నానిపోయి నల్లబారిందని అన్నారు. జేసీ స్పందిస్తూ పంట బీమా వచ్చేలా చూస్తామన్నారు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామంలో తడిసిన వేరుశనగ పంటను జాయింట్ కలెక్టర్ నవ్య పరిశీలించారు. రైతు చాంద్ బాషా పొలంలో వేరుశనగను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆదోని ఆర్‌డీవో విశ్వనాథ్, తహసీల్దార్ కుమారస్వామి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏవో హేమలత, మహేంద్ర పాల్గొన్నారు.

- గోనెగండ్ల తహసీల్దార్ కుమారస్వామిపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటల పరిశీలినకు వచ్చిన గంట తరువాత కూడా తహసీల్దార్ ఆ ప్రాంతానికి రాలేదు. జాయింట్ కలెక్టర్ తిరుగు ప్రయాణమయ్యే సమయంలో తహసీల్దార్ అక్కడకు వచ్చారు. దీంతో విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ఆమె మండిపడ్డారు. రైతులు కష్టాలలో ఉంటే ఏం చేస్తున్నారని, పంటలను పరిశీలించకుండా నివేదిక ఎలా తయారు చేస్తామని అన్నారు.

## మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

### ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు

**మంత్రాలయం, సెప్టెంబరు 1:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్లు, పరిమళ ప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. ఇసుకేస్తే రాలనంత భక్తులు తరలి రావడంతో శ్రీ మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు పరిమళ ప్రసాదం కొరత రానీయకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు. ఆదివారం శ్రావణ చతుర్దశి శుభదినాన్ని పురస్కరించుకొని రామచంద్రుని స్వర్ణ పల్లకోత్సవం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర లా కమిషనర్, రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ నిజంగ జీ నవర్ ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు.

## చెట్టును ఢీకొన్న కారు.. ఆరుగురికి గాయాలు


చెట్టుకు ఢీ కొట్టిన బొలెరా వాహనం

**మహానంది, సెప్టెంబరు 1:** మహానంది మండలం తమ్మడపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన మలుపు వద్ద ప్రమాదవశాత్తు బొలేరో కారు వాహనం చెట్టును ఢీ కొట్టింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో కోవెలకుంట్ల మండలం గొట్టిపాడుకు చెందిన ఆరుగురు గాయపడ్డారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలోని ఒక శుభకార్యానికి హాజరై తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మహానంది పోలీసులు పరిశీలించారు.

## గుండెపోటుతో రైతు మృతి

**మద్దికెర, సెప్టెంబరు 1:** మద్దికెర గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివసించే రైతు పారా రాజేంద్ర (47) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. రాజేంద్ర తన నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రెండెకరాల్లో ఈ ఏడాది ఉల్లి పంటను సాగు చేశాడు. అధిక వర్షాల వల్ల ఆదివారం పంట మొత్తం నీట మునిగింది. దీంతో మనస్తాపానికి గురై నిద్రలోనే మరణించాడు. కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పారా రాఘవేంద్ర కోరారు.

## అప్రమత్తంతోనే జ్వరాల నివారణ

### డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్



**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 1:** అప్రమత్తంగా ఉండడం వల్ల సీజనల్ వ్యాధులు, సాధారణ జ్వరాలను నివారించ వచ్చని డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి వడబోసి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని, ప్రతి రోజూ ఇంటిలో అప్పటికప్పుడు తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉన్న ఎడల నీటి గుంతలను మట్టితో కప్పి వేయాలని సూచించారు. ఇంటిలో పాతటైర్లు, టెంకాయల చిప్పలు, పాతవాటర్ బాటిల్స్‌ను పడేయాలని అన్నారు. ఇంట్లోకి దోమలు ప్రవేశించకుండా సాయంత్రం 6 గంటలకు ఇంటి తలుపులు, కిటికీలను మూసివేయాలని, ఇంటిలోగానీ పక్కనగానీ ఎవరైనా జ్వరంతో బాధపడితే స్థానికంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## రాష్ట్ర స్థాయి అండర్-17 ల్యాక్రోస్ క్రీడలు ఆరంభం


క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

**కోసిగి, సెప్టెంబరు 1:** మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో రాష్ట్ర స్థాయి అండర్-17 ల్యాక్రోస్ క్రీడలు రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో డి. బెళగల్ గ్రామ విజేత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా ల్యాక్రోస్ క్రీడల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మునికృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పద్మ, రామయ్య, కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ హాజరయ్యారు. ఈ క్రీడా పోటీల కు విజయనగరం, కర్నూలు, గుంటూరు, ప్రకాశం, ఒంగోలు, అనంతపురం, బాపట్ల, శ్రీకాకుళం, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించండి

### కలెక్టర్ పి. రంజిత్‌బాషా

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1:** గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం భారీ వర్షాలు, పింఛన్ల పంపిణీపై అధికారులతో కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, కళాశాలలకు ప్రభుత్వ సెలవు ప్రకటించిందని అన్నారు. వర్షాల నేపథ్యంలో తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు వారి పరిధిలోని హాస్టళ్లు, పాఠశాలలను తనిఖీలు చేయాలన్నారు. సోమవారం, మంగళవారం మండల వ్యవసాయాధికారులు పంటలను మరోసారి పరిశీలించి నష్టంపై నివేదికను అందజేయాలని ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్ పైన ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో, జడ్పీ సీఈవోలకు సూచించారు. గ్రామాల్లో నిల్వ ఉన్న వర్షం నీరు వేగవంతంగా క్లియర్ చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో బ్లీచింగ్ చేయించాలన్నారు. తాగునీటి లీకేజీలు ఏవైనా ఉంటే వెరిపై చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. తాగునీటి పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 97 శాతం పంపిణీ పూర్తయిందని మిగిలిన మూడు శాతం సోమవారం మధ్యాహ్నం లోపు పూర్తి చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆర్డీవోలు జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## కుంగిన సుంకేసుల బ్యారేజీ మట్టి కట్ట

### అప్రమత్తమైన అధికారులు


మరమ్మతులు చేస్తున్న అధికారులు

**కర్నూలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** కేసీ కాలువ ఆయకట్టు రైతుల జీవనాడి సుంకేసుల జలాశయం మట్టికట్ట ఓ వైపు కుంగిపోవడంతో ఇంజనీర్లు అప్రమత్తమయ్యారు. తక్షణ మే మరమ్మతులు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం వైపు వర్షపు నీటికి కోతకు గురై కట్ట కుంగిపోయిందని ప్రాజెక్టు డీఈఈ రఘురామిరెడ్డి వివరించారు. సుంకేసుల డ్యాం గరిష్ఠ నీటి మట్టం 292 మీటర్లు, సామర్థ్యం 1.20 టీఎంసీలు. ఆదివారం జలాశయంలోకి 5,944 క్యూసెక్కులు వరద వచ్చి చేరింది. 1,465 క్యూసెక్కులు కేసీ కాలువకు వదులుతున్నారు. 4,479 క్యూసెక్కులు గేట్లెత్తి దిగువ శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో సరిహద్దుల్లో ఓ మోస్తారుగా వర్షాలు కురుస్తు న్నాయి. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా మండల కేంద్రం రాజోలి గ్రామానికి రెండు కి.మీల దూరంలో వర్షపునీటి బ్యారేజీ మట్టికట్ట బయటి వైపున దాదాపు పది అడుగు లు వెడల్పు, పది అడుగుల లోతులో కుంగిపోయింది. తక్షణమే అప్రమత్తమైన డ్యాం డీఈఈ రాఘురామిరెడ్డి సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకు న్నారు. ఎర్ర గరుసుతో కుంగిన కట్టను మరమ్మ తులు చేశారు. దీని వల్ల ప్రధాన ఆనకట్టకు ఎలాం టి ప్రమాదం లేదని డీఈ ఈ వివరించారు. 2009లో వచ్చిన భారీ వరదలకు డ్యాం ఆనకట్ట అడ్డంగా కోతకు గురైంది. అప్పట్లో మరమ్మతులు చేశారు. శాశ్వత మరమ్మతులు చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం కేవలం గేట్ల మరమ్మతులకు నీరు-చెట్టు కింద దాదాపు రూ.8.50 కోట్లు నిధులు విడుదల చేసి మరమ్మతులు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. శాశ్వత మరమ్మతులకు నిధులు ఇవ్వాలంటూ 2009-10 నుంచి ప్రతి ఏడాది ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపుతున్నా ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. ప్రధాన డ్యాంకు ప్రమాదం లేకపోయినా.. మట్టికట్ట కుంగిపోయి పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సుంకేసుల బ్యారేజీ సహా కేసీ కాలువ శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## రేపు జాబ్ మేళా

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 1:** నిరుద్యోగ యువతీ యువకులకు 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఏసీ శిక్షణా కేంద్రం, బిర్లాగేట్ ఎదురుగా నిర్వహించే కార్యక్రమానికి ఎల్ అండ్‌టీ, పేటీఎం, ఎస్బీఐ కార్డు, అమర్ రాజ గ్రూప్స్, అమెజాన్ వేర్ హౌస్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

## రైతులకు పంట రుణాలు మాఫీ చేయాలి

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 1:** రాష్ట్రంలోని ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో రైతు సంఘం అధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు పంట రుణాలు మాఫీ చేశారని, అదేవిధంగా ఏపీ సీఎం కూడా చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి. రామక్రిష్టారెడ్డి, సహాయ కార్యదర్శులు శ్రీనివాసరావు, సి. మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ ప్రత్యేక పూజలు


సంగమేశ్వర క్షేత్రం వద్ద ఎస్పీ కుటుంబ సభ్యులు

**కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 1:** నగర శివారు జగన్నాథ గట్టుపై వెలసిన శ్రీరూపాల సంగమేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ఎస్పీ జి. బిందుమాధవ్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఎస్పీ స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో వై గురురెడ్డి ఎస్పీని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు తాలూకా సీఐ శ్రీధర్, ఆలయ అర్చకుడు లంక సురేష్ శర్మ, ఆలయ క్లర్కు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం: ఎంపీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు (అర్బన్), సెప్టెంబరు 1:** మట్టివినాయకులనే ఏర్పాటు చేసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో గుడ్ మార్నింగ్ ధర్మసంస్థాన్ మార్గ్ దర్శన్ ఆత్మ గోకుల సాలి సంఘం జిల్లా అధ్యక్షులు సపరే గోవిందరాజులు ఆధ్వర్యంలోమట్టి వినాయకుడి ఫ్లెక్సీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

## వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 1:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వైద్యులు, సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గత మూడు రోజుల నుంచి వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, కరెంటు అంతరాయం తలెత్తకుండా ఆసుపత్రిలో పవర్‌స్టేషన్‌ను సూపరింటెండెంట్ సందర్శించి జనరేటర్లలో డీజిల్ గురించి ఆరా తీశారు. డీజిల్ అవసరమైతే అదనంగా తెప్పించి ఇబ్బంది లేకుండా చూడాలని అడ్మినిస్ట్రేటర్స్ ఆఫీసర్ డా.కిరణ్ కుమార్‌ను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఎలక్ట్రికల్ సిబ్బందికి సెలవులను రద్దు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అనంతరం ఆసుపత్రిలోని డ్రైనేజీలను పరిశీలించారు. ఎక్కడైనా కరెంటు వైర్లు వేలాడుతున్నాయో పరిశీలించాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## హెచ్చరిక

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికీ తెలియజేయడం ఏమనగా! మేము అనగా **జూటూరు గోపాల్ గారి కుమార్తె అయిన ఎస్.మీనాకుమారి, నివాసం : హైదరాబాద్ నగరములో బంజారా హిల్స్ ప్రదేశంలో మరియు జూటూరు భాస్కర్ కుమార్తె అయిన జూటూరు విష్ణుప్రియ, నివాసం : బెంగళూరు నగరములో జె.పి.నగర్** 5th FACE ప్రదేశంలో మరియు **జూటూరు సుధాకర్ కుమార్తె అయిన జూటూరు లక్ష్మి సింధూరమాల, నివాసం: బెంగళూరు నగరములో బిలేకహళ్లి** ప్రదేశంలో, యావన్మంది ప్రజలకు తెలియజేయడము ఏమనగా! మేము మా తండ్రి గార్లపైన మరియు మా అన్న తమ్ముళ్లు **జూటూరు నరేష్, జూటూరు విశ్వనాథ్, జూటూరు శ్రీకాంత్, జూటూరు క్రిష్ణ భార్గవ్, జూటూరు రవితేజ** లపైన మేము పార్టిషన్ కొరకు దావాను కర్నూలు 6వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు, కర్నూలు నందు **O.S.No.57/2023** దావా వేసినాము, ఇంకా మేము **బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర హెడ్ ఆఫీసు, శివాజీనగర్, పూణే, మహారాష్ట్ర** మరియు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సుల్తాన్‌బజార్ బ్రాంచ్, హైదరాబాద్ (తెలంగాణా)** లపై కూడా షెడ్యూల్‌లో కనపరిచిన ఆస్తిపై ఎలాంటి వేలం చేయకూడదని సదరు దావా వేసి ఉన్నాము. సదరు దావా ప్రస్తుతము కోర్టు నందు విచారణలో వున్నది. కావున ఈ విషయమై మేము తెలుపునది ఏమనగా! క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించిన కేసు కోర్టు నందు పెండింగ్‌లో ఉన్నది. కావున బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర హెడ్ ఆఫీసు, శివాజీనగర్, పూణే, మహారాష్ట్ర లేదా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సుల్తాన్‌బజార్ బ్రాంచ్, హైదరాబాద్ (తెలంగాణా) వారు ఎలాంటి వేలం జరిపినా మరియు ఆ వేలములో ఎవరైనా వారినుండి గాని లేక వారి ప్రతినిధులనుండి గాని మరియు ఏ ఇతరుల నుండి గాని క్రయ విక్రయము జరిపినాగాని లేదా ఇతర లావాదేవీలు జరిపినా అట్టి లావాదేవీలు "Transfer of Property Act, 1882" ప్రకారము చెల్లనేరవు. కావున మేముచేయుచున్న చట్టబద్ధమైన హెచ్చరిక.

**షెడ్యూలు :** కర్నూలు జిల్లా, సర్వే నెంబర్లు : 403/2, 404/ఎ, & 404/బి2 (ప్రస్తుతం సర్వే నెంబర్లు 403/2ఎ3, 404/ఎ2 & 404/బి2సి) లో నిర్మింపబడిన ఆస్తి, ప్రస్తుతము కర్నూలు నగరము మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, కర్నూలు S.R.O. మరియు R.O పరిధిలోని ఆర్.టి.సి బస్టాండ్ ఎదురుగా ఉన్న డోర్ నెం: 51/937, విస్తీర్ణం: 3763.6531 చదరపు గజములకు **చెక్కుబంది. తూర్పు :** మార్కెట్‌యార్డ్ కాంపౌండ్ వాల్, **పశ్చిమము:** వెంకటరమణ షాపింగ్ కాంప్లెక్స్, **ఉత్తరము:** మార్కెట్‌యార్డ్ కాంపౌండ్ వాల్, **దక్షిణము:** మేము మా స్థలములో వదిలిన 30 అడుగుల రోడ్డు.

స్టేషన్ : కర్నూలు,
తేదీ :01-09-2024

ఇట్లు : ఎస్.మీనాకుమారి, జూటూరు విష్ణుప్రియ, జూటూరు లక్ష్మి సింధూర మాల



# అప్పుడలా ఇప్పుడిలా..!


నగరంలోని కిడ్స్ వరల్డ్ వద్ద ఆగిపోయిన క్లాక్ టవర్ నిర్మాణం

- ఎన్నికల ముందు హడావుడి చేసిన కార్పొరేషన్ అధికారులు
- పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం
- మధ్యలోనే వదిలేసిన వైనం
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- నేడు ఏమాత్రం పట్టించుకోని దైన్యం

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 1:** నగరంలో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు అటకెక్కాయి. ఎన్నికల ముందు హడావుడి చేస్తూ రోడ్లు, కూడళ్ల అభివృద్ధి కోసం అధికారులు శంకుస్థాపనలు చేశారు. అయితే వాటిని పూర్తి చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఐదేళ్లలో ఏదో అభివృద్ధి చేసినట్లుగా గత వైసీపీ ఎమ్మెల్యేలు, మేయర్, కార్పొరేటర్లు చెప్పుకొచ్చారు. అయితే అభివృద్ధి పనులకు వచ్చేసరికి కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మొహం చాటేస్తున్నారు.

### ● సుంకేసుల రోడ్డులో...

నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు మామిదాలపాడు దాటిన తర్వాత సుంకేసుల రోడ్డు నుంచి జాతీయ రహదారి వెళ్లే దారిలో కూడలిని అభివృద్ధి చేయాలని అప్పటి నాయకులు, అధికారులు నిర్ణయించారు. ఇక చేసిందే తడవుగా కూడలి నిర్మాణానికి రూ.49 లక్షల నిధులు మంజూరు చేశారు. గతంలో ఆ కూడలి ప్రాంతాన్ని తిప్పమ్మ కొట్టం అని పిలిచేవారు. ఎన్నో ఏళ్లుగా ఇదే పేరుతో ఉన్న కూడలిని వైసీపీ హయాంలో మార్పు చేయాలని ఆలోచించింది. కూడలి పనులను సగంలోనే నిలిపివేశారు. ఇక్కడ కొందరు దుండగులు నిర్మాణంలో ఉన్న ఐరన్ కడ్డీలను దొంగలిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. నిజానికి ఈ ప్రదేశంలో కూడలిని అభివృద్ధి చేసి శ్రీకృష్ణదేవరాయాలు విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

### ● నిర్లక్ష్యంగా విద్యుత్ శాఖ అధికారులు

కూడలి మధ్య విద్యుత్ స్తంభం ఉంది. దానిని ఇతర ప్రాంతానికి తరలించడానికి నగర పాలక సంస్థ అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దానికి సంబంధించి స్తంభం అక్కడి నుంచి తొలగించడానికి విద్యుత్ శాఖ అధికారులు అంచనాలు రూపొందించి సంస్థ అధికారులకు ఇవ్వాలి. మూడు నెలల నుంచి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కూడలి నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఇప్పటికే కమిషనర్ నుంచి విద్యుత్ శాఖ అధికారులకు లేఖలు కూడా పంపినట్లు కేఎంసీ అధికారులు తెలిపారు.

### ఆగిన క్లాక్ టవర్ నిర్మాణం

● ఇదే కోవలోకి కిడ్స్ వరల్డ్ ఎదురుగా ప్రధాన రహదారిపై క్లాక్ టవర్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై.రామయ్య, కమిషనర్ ఏ. భార్గవతేజ హడావుడిగా ఎన్నికల ముందు శంకుస్థాపన చేశారు. దాని కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తూ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. అయితే స్థానిక వడ్డెగేరికి చెందిన కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని.. గతంలోనే కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని మధ్యంతర ఉత్తర్వులు తీసుకొచ్చారు. దీంతో 20 శాతం పనులు చేశారు. అందు కోసం సుమారు రూ.20 లక్షల మేర బిల్లులు కూడా చెల్లించారు.

### విగ్రహం రాకపోవడంతోనే ఆగిన పనులు

శ్రీకృష్ణదేవరాయల విగ్రహం రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. అంతే కాకుండా కనీస నిర్మాణం చేపట్టాలంటే మధ్యలో విద్యుత్ స్తంభం అడ్డంగా ఉంది. స్తంభం తీస్తే కాని పనులు ముందుకు సాగవు. విద్యుత్ అధికారులకు పలుమార్లు సమాచారం అందించిని పట్టించుకోవడం లేదు. కిడ్స్ వరల్డ్ కూడలికి సంబంధించి కోర్టు పరిధిలో ఉంది.

\- షాకీర్ హుస్సేన్, ఎంఈ, నగర పాలక సంస్థ


సుంకేసుల రోడ్డులో ఆగిపోయిన కూడలి నిర్మాణం

## లద్దగిరి హాస్టల్ పరిశీలన


**కోడుమూరు (రూరల్), సెప్టెంబరు 1:** మండలంలోని లద్దగిరి బీసీ హాస్టల్ 1, 2 లను తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ ఆదివారం పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో గదుల గోడలకు తడి రావడం గమనించారు. అలాగే పైపెచ్చులు ఊడిన గదులను పరిశీలించారు. దీంతో హాస్టల్‌లో ఉంటున్న సుమారు 440 మంది విద్యార్థులను పక్కనే ఉన్న హైస్కూల్ గదులలో నిద్రించడానికి చర్యలు తీసుకున్నారు. వంట గది, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లైట్లు, ఫ్యాన్లు రిపేర్లు ఉంటే మరమ్మతు చేయించాలని వార్డెన్ శ్రీనివాసులుకు సూచించారు.

## పంటలపై జాగ్రత్తలు తీసుకోండి


పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రవిప్రకాష్‌గౌడ్

**కోడుమూరు (రూరల్), సెప్టెంబరు 1:** మండలంలో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా పంటల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను వ్యవసాయాధికారి రవిప్రకాష్‌గౌడ్ సూచించారు. ఆదివారం లద్దగిరి గ్రామంలో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రస్తుత వర్షాలతో అయితే పంటలకు ఎటువంటి నష్టం లేదని అన్నారు. ముందు జాగ్రత్తగా పత్తిలో పొటాషియం నైట్రేట్ 5 గ్రాములను లీటరు నీటికి కలిపి లేదా 10 గ్రాముల యూరియాను కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కంది పంటకు పొటాషియం నైట్రేట్‌తో పాటు 19.19.19లను పదిగ్రాములు పిచికారీ చేయాలన్నారు.

## ఊపిరితిత్తుల సమస్యలకు సరికొత్త చికిత్స


సదస్సులో పాల్గొన్న ఫల్మనాలజిస్టులు

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 1:** చిన్న వయస్సు నుంచి కొంత మందికి వచ్చే ఆస్తమా నివారణకు గతంలో వాడే మందులు ఇప్పుడు అసలు ఉపయోగంలో లేవని, కొత్తగా వస్తున్న మందులు సమర్థవంతంగా పని చేస్తున్నాయని ఈ మందులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యనిపుణులు తెలిపారు. కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో లంగ్స్ టాక్ పేరుతో వైద్యవిజ్ఞాన సదస్సు ఆదివారం ఐఎంఏ, కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగింది. కర్నూలు కిమ్స్ హాస్పిటల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.జి.సుధాకర్, కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన ఫల్మనాలజిస్టు డా.శుభాకర్ నాదేళ్ల ఆసుపత్రి కన్సల్టెంట్ డా.వెంకట చలమయ్య, కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, బళ్లారి, రాయచూరు, హైదరాబా దు, మేడ్చల్ ప్రాంతాల నుంచి 150 మంది జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ టీబీ రాకుండా కొన్ని రకాల టీకాలు వస్తున్నాయని, ఇంకా ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోపి థోరాకోస్కోపి లాంటి వైద్యవిధానాలు వాటిలో ఉపయోగించే అత్యాధునిక పరికరాలు వాడే విధానాన్ని వివరించారు. ఐఎంఏ అధ్యక్షుడు డా.కే.రామచంద్ర నాయుడు, ఉపాధ్యక్షులు డా.ఎస్. వెంకటరమణ, కోశాధికారి డా.మాధవీ శ్యామల, కర్నూలు కిమ్స్ సీఈవో డా. సునీల్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలతో మహా ముప్పు

● నంద్యాల మెడికల్ కాలేజీ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇక్రాముల్లా

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 1:** మాదక ద్రవ్యాల వినియోగంతో మహాముప్పు ఏర్పడుతుందని నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ మానసిక వైద్యవిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇక్రాముల్లా హెచ్చరించారు. ఆదివారం రాత్రి నగరంలోని ఎ.క్యాంపులో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డా. ఇక్రముల్లా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటు వల్ల యువకులు బానిసగా మారుతారన్నారు. తద్వారా మెదడులో మార్పులు జరిగి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఒక కంట కనిపెడుతూ ఉండాలని, ఈ అలవాటు ఉన్న వారిని త్వరగా గుర్తించి చికిత్స అందించాలన్నారు.

## విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి


క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ వాసురెడ్డి

**కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 1:** విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని డా.సి.వాసురెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు పార్కులో ఏర్పాటు చేసిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సాధనతో తైక్వాండో బెల్టు గ్రేడింగ్‌లో సాధించిన క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేసి అభినందించారు. బెల్టులు సాధించిన పార్థసారథి, కె.సుధీర్, హేమలత, శ్రీలక్ష్మి, చాతుర్య మనస్విని, విష్ణుసాయితీర్థులు ఎల్లో బెల్టులు సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ టి. వెంకటేశ్వర్లు తెలిపారు.

## 'నగర బ్రాహ్మణ సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి'


సమావేశంలో పాల్గొన్న నగర బ్రాహ్మణ సంఘ సభ్యులు

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 1:** కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం పాత కమిటీని రద్దు చేసి, నూతనంగా ఎన్నికలు నిర్వహించాలని నగర బ్రాహ్మణ సంఘం సభ్యుడు చల్లా నాగరాజశర్మ అన్నారు. ఆదివారం నగరంలో సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో కర్నూలు, కల్లూరుకు చెందిన సుమారు వంద మంది సంఘం సభ్యులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చల్లా నాగరాజ శర్మ, సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగర బ్రాహ్మణ సంఘం పాత కమిటీని రద్దు చేస్తూ చేస్తూ సభ్యులు తీర్మానించారని తెలిపారు. అలాగే కొత్తగా సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల అధికారిగా డీవీఆర్ శర్మను నియమించాలని ఆయన పేరును ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. సంఘ కార్యక్రమాలకు, సభ్యుని గుర్తింపు కార్డునకు ప్రతి సభ్యుని వద్ద రూ.215 చెల్లించేలా నిర్ణయించామని తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు హరిహర క్షేత్రంలో భగవంతుని సేవకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఆలయ ధూప దీప నైవేద్యాలు, ఆలయ అర్చకుల జీతాలు ఎన్నికల అధికారి పర్యవేక్షణలోకి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు.

## క్రీడల్లో రాణించాలి


కుడో క్రీడా విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

**కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 1:** క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని జిల్లా ఒలంపిక్ అసోసియేసన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు అన్నారు. ఆదివారం కుడో క్రీడా అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నగర సమీపంలో ఉన్న పెద్దపాడు వేదాంత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పోటీలు ముగిశాయి. బి. రామాంజనేయులు మాట్లాడుతూ బాక్సింగ్, కరాటే, మతాయి బాక్సింగ్, జూడో తదితర క్రీడల మిళితమే కుడో క్రీడాంశమని ఆయన వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్, జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధి ఆరీఫ్ హుసేన్, కుడో సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, కరస్పాండెంట్ పరమేశ్వర్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

## కేసీలో ఆవును రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

**కర్నూలు, సెప్టెంబరు 1:** కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న ఆవును అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. స్థానిక లక్ష్మీనగర్ సమీపంలో ఆదివారం రాత్రి కేసీ కెనాల్ ప్రవాహంలో ఒక ఆవు కొట్టుకుపోతూ కనిపించింది. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. హుటాహుటిన వారు అక్కడకు చేరుకుని ఆవును తాళ్లతో బయటకు లాగారు.

## గుడ్లవల్లేరు ఘటనపై విచారణ జరిపించాలి


సుందరయ్య కూడలిలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 1:** గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య జంక్షన్‌లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ అధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ రేప్ కేసు నుంచి సజ్జన్ జిందాల్‌ని రక్షించడానికి ముంబై నటి జిత్వానీతో పాటు ఆమె కుటుంబాన్ని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో నిర్బంధించిన ఐపీఎస్‌లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాల ఘటనపై విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

● డీవైఎఫ్ఐ పాతబస్తీ సర్వసభ్య సమావేశం కార్మిక కర్షక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. మాజీ జిల్లా అధ్యక్షుడు డి. గౌస్‌దేశాయ్, ప్రస్తుత జిల్లా కార్యదర్శి నగేష్ హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

● యుద్ధాలు వద్దు శాంతి కావాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. పాతబస్తీ మండిబజార్, కొత్తబస్టాండు సుందరయ్య కూడలిలో సీఐటీయూ అధ్వర్యంలో యుద్ధాలు వద్దు ప్రపంచశాంతి కావాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ అమెరికా తన ఆధిపత్యం కోసం యుద్ధాలు చేస్తున్నదని అన్నారు.

● వీరనారి ఐలమ్మ, సత్తెనపల్లె రామక్రిష్ణ వర్ధంతి సభను ఈ నెల 10న జయప్రదం చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. గురుశేఖర్ పిలుపునిచ్చారు. కేకే భవన్‌లో వర్ధంతి సభ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. సమావేశంలో జయమ్మ, రాముడు, రవిశంకర్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టాలను వ్యతిరేకించాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


మాట్లాడుతున్న కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సుభాన్

**కర్నూలు(న్యూసిటీ), కర్నూలు అర్బన్, సెప్టెంబరు 1:** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వక్ఫ్ చట్ట సవరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాతబస్తీలోని ఉర్దూ ఘర్ షాదిఖానాలో వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు పి. ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన వివిధ ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ రాజేందర్ సచార్ కమిటీ సిఫారసుల మేరకు దేశంలో వెనుకబడిన ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం వక్ఫ్ ఆస్తులు ఉపయోగించి వారికి ఫలాలు అందించాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఖాజా హుస్సేన్, మహ్మద్‌పీర్, మూమెంట్ ఫర్ పీస్ జస్టిస్ రాష్ట్ర నాయకులు ఖాదిర్‌బాషా, ముస్లిం ఐక్యవేదిక నాయకులు జాకీర్ హుస్సేన్, జమాతే ఇస్లాం ఏ హింద్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1:** పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాడుతామని సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్‌లను అమలు చేయాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. ఆదివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీపీఎస్ యూపీఎస్ ప్రతిపాదనలను వెంటనే ఉప సంహరించుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు సి. నాగరాజు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు సుంకన్న పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన పీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రెండు శతాబ్దాలుగా ఉద్యోగుల జీవితాల్లో చీకటి నింపిని పీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు.

## పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు


రక్తదానం చేస్తున్న యువకులు

**కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 1:** జననేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆ పార్టీ రాయలసీమ జోనల్ ఎన్నికల కన్వీనర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయల విగ్రహం సమీపంలో పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజకీయాల్లో, సామాజిక సేవల్లో పవన్‌కల్యాణ్ ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో జనసైనికులు రాజేష్, సతీష్, అనిల్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ


దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 1:** ప్రమాదవశాత్తు కాళ్లు చేతులు పోగొట్టుకున్న వారికి, పుట్టుకతో అంగ వైకల్యంతో జన్మించిన దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఆదివారం నగరంలో బుధవారపేటలోని కేశవ మెమోరియల్ పాఠశాల్లో, భారత్ వికాస్ పరిషత్ కర్నూలు-తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీపురం ఆనంద్‌కుమార్, భారత్ వికాస్ పరిషత్ తిరుపతి ప్రాంత అధ్యక్షుడు బీవీ బాలసుబ్రహ్మణ్యం, తిరుపతి పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి కోసమే సీఎం తపన

**మంత్రాలయం, సెప్టెంబరు 1:** రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నదే సీఎం చంద్రబాబు తపన అని టీడీపీ నాయకులు ఆదివారం రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ మూడు దశాబ్దాలలో సీఎంగా బాధ్యతలు చేపట్టి పాలనలో కొత్త ఒరవడి సృష్టించారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చెత్తపైన పన్నులు వేస్తే.. ఆ చెత్త నుంచే సంపదను సృష్టించిన ఘనత చంద్రబాబుదే అని కొనియాడారు.

## ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**మద్దికెర, సెప్టెంబరు 1:** భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ హుశేన్‌సాహేబ్ సూచించారు. ఆదివారం మద్దికెర గ్రామంలోని బాలుర వసతి గృహం, మట్టి గృహాలను పరిశీలించారు. మట్టిమిద్దెలు కూలిపోయేలా ఉంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వీఆర్వోలకు సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తహసీల్దార్ కోరారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**పత్తికొండ, సెప్టెంబరు 1:** సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవుడు, స్టేట్ కౌన్సిలర్‌సభ్యుడు చందూనాయక్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం పత్తికొండ నాలుగు స్థంభాల కూడలివద్ద ధర్నా నిర్వహించారు. జయరాముడు, లోక్యానాయక్‌లతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులు జాగ్రత్త తీసుకోవాలి

**గోనెగండ్ల, సెప్టెంబరు 1:** ఎడతెరిపి లేని వర్షాలతో రైతులు పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. ఆదివారం గ్రామాల్లో పొలాలను సందర్శించారు. పత్తి ముంపునకు గరయితే, ఎండగా ఉన్న సమయంలో పోటీషియం నైట్రేట్ 5గ్రాములను లీటర్ నీటిలో లేదా 10 గ్రాముల యూరియాను లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. మరిన్ని వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.

## వినాయక ఉత్సవాలు ప్రారంభం

**ఆదోని టౌన్, సెప్టెంబరు 1:** వీహెచ్‌పీ కార్యాలయంలో వినాయక ఉత్సవాలకు గురుసిద్ధ స్వామి, ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు ఎగ్గటి ప్రతాప్ ధ్వజారోహణ చేశారు. ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు గౌడ్, డివిజన్ ఇన్‌చార్జి కునిగిరి నీలకంఠ, విట్టా రమేష్, సాకరే మారుతి రావు, దేవిశెట్టి ప్రకాష్, శ్రీకాంత్ రెడ్డి, సోమశేఖర్ గౌడ్, ఉపేంద్ర కుమార్, ఎండీ బసవరాజు, చెన్నబసప్ప పాల్గొన్నారు.

## విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

**ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 1:** విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆదివారం డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాత్రూముల్లో కెమెరాలు పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పని చేసే నాయకులు కావాలి

**ఆదోని టౌన్, సెప్టెంబరు 1:** నాయకుడి కోసం కాకుండా, ప్రజల కోసం పని చేసే నాయకులు కావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్ అహమ్మద్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్ల తీరు సరికాదన్నారు. తాయన్న పాల్గొన్నారు.

## డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

**తుగ్గలి, సెప్టెంబరు 1:** పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యను టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, శ్రీనివాసులు గౌడు, ఎద్దులదొడ్డి సర్పంచ్ విజయుడు ఆదివారం కలిశారు. డీఎస్పీని సన్మానించి, సమస్యలను తెలిపారు. మైరాముడు, తిమ్మప్ప పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి



పాఠశాల పూర్వ విద్యార్థులు

**తుగ్గలి, సెప్టెంబరు 1:** పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థి, టీడీపీ అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. ఆదివారం పెండేకల్ జడ్పీహెచ్ఎస్‌లో 1992-93 పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. మద్దిలేటి నాయుడు, సుభాష్ చంద్రబోస్, ఈశ్వర య్యశెట్టి, ప్రతాప్ రెడ్డి, చాంద్‌బాషా, రాఘవేంద్రమ్మ పాల్గొన్నారు.

## అన్నదానానికి విరాళం

**మంత్రాలయం, సెప్టెంబరు 1:** శ్రీమఠంలో నిర్వహించే అన్నదానానికి రాజమండ్రికి చెందిన జాగీర్దార్ భీమ్‌సేన్‌రావు రూ.2 లక్షల విరాళం ఇచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. వారికి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించామన్నారు.

## గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

**ఆలూరు రూరల్, సెప్టెంబరు 1:** మండలంలోని మనేకుర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కురువ మల్లయ్య(47) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఈరమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సర్పంచ్ కొల్లమ్మ, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, అయ్యాళి, దేవేంద్ర సంతాపం తెలిపారు, కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

## బాలకృష్ణ అభిమానుల సంబరాలు

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 1:** బాలకృష్ణ 50ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం ఎమ్మిగనూరులో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. శివథియేటర్‌లో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. హోటల్ చంద్ర, తెలుగురాముడు, రంగస్వామి గౌడ్, రమేష్, పక్కీరప్ప, రాజు, బోడబండ రంగస్వామి, వీరేష్, ఈరన్న, గిడ్డయ్య, రాముడు పాల్గొన్నారు.



# ఆదివారం రోగమొస్తే అంతే!

- అందుబాటులో ఉండని వైద్యులు
- మద్దికెర పీహెచ్‌సీలో ఇష్టారాజ్యం



ఆదివారం విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్సు రాధ

**మద్దికెర, సెప్టెంబరు 1:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్యులు ఉండటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పీహెచ్‌సీని ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా. ఒక స్టాఫ్ నర్సు రాధ మాత్రమే విధులు నిర్వహిస్తూ కనిపించారు. పీహెచ్‌సీకి శ్రీలక్ష్మి, రాగిణి అనే వైద్యాధికారులను ప్రభుత్వం నియమించింది. శ్రీలక్ష్మి గుంతకల్‌లో ఉండగా, మరో వైద్యాధికారి రాగిణి మద్దికెరలో ఉంటున్నట్లు సమాచారం. పీహెచ్‌సీ పరిధిలో 11 గ్రామాలుండగా, దాదాపు 45వేల జనాభా ఉంది.

**సమయపాలన పాటించని వైద్యులు**

పీహెచ్‌సీకి వైద్యులు సమయానికి రావడం లేదని, ఆలస్యంగా వచ్చి సాయంత్రం కాకముందే వెళ్లిపోతున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఇరువురు వైద్యులూ అందుబాటులో ఉండరని తెలుస్తోంది. ఒకరు సెలవు తీసుకుని మరొకరు విధులు నిర్వర్తించే అవకాశమున్నా వారు పట్టించుకోవడం లేదని సమాచారం. కాగా శుక్రవారం సాయంత్రం మద్దికెరకు చెందిన జ్యోతి కాన్పు కోసం వస్తే.. వైద్యులు లేరని వేరే ఆసుపత్రికి వెళ్లవలసిందిగా సూచించినట్లు సమాచారం.

**పరీక్షలు చేసేవారేరీ?**

ల్యాబ్‌టెక్నీషియన్, సీహెచ్‌వో, హెల్త్ ఎడ్యుకేటర్, ఇద్దరు వైద్యాధికారులు, ఫార్మసిస్టు, ముగ్గురు నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఆదివారం పరీక్షలు చేసేవారు అందుబాటులో ఉండరని సమాచారం. రక్తపరీక్షలు, ఈసీజీ పరికరాల ఉన్నా, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం విచారకమని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆదివారం వీక్లీ ఆఫ్ తీసుకుంటాం**

ఆరు రోజులు విధులు నిర్వహించి, ఆదివారం వీక్లి ఆఫ్ తీసుకుంటాం. స్టాఫ్ నర్సులు మాత్రమే 24 గంటలు మాత్రం విధుల్లో ఉంటారు. - **శ్రీలక్ష్మి, వైద్యాధికారి**

## అప్రమత్తంగా ఉండాలి

**మద్దికెర, సెప్టెంబరు 1:** ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ సూచించారు. ఆదివారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. తడిసిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని, కరెంటు తీగల వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, తీగలు తెగిపోతే తమ దృష్టికి తేవాలని కోరారు.

## టమోటా మార్కెట్ ప్రారంభం

**ఆస్పరి, సెప్టెంబరు 1 :** మండల కేంద్రంలో టమోటా కూరగాయల మార్కెట్‌ను ఆదివారం ప్రారంభించారు. కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ దొరబాబు, వెంకటరాముడు, శివన్న, సంజప్ప, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## సింగిల్ విండో ద్వారా అనుమతి

**ఆలూరు, సెప్టెంబరు 1 :** గణేష్ ఉత్సవాలకు ప్రత్యేక పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు ఆదివారం తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సింగిల్ విండో విధానంలో గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని 7995095800 మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్.. అని పంపితే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

## హాస్టల్ భవనాల పరిశీలన



ఎస్సీ బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐ

**ఆలూరు, సెప్టెంబర్ 1:** కురుస్తున్న భారీ వర్షాలతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఐ బసవన్న గౌడ్, వీఆర్వో రవికుమార్ హాస్టళ్లను పరిశీలించారు. భవనాల భద్రతపై వార్డెన్‌లతో చర్చించారు. ప్రమాదకరంగా ఉన్న గదుల్లో పిల్లలను ఉంచవద్దని సూచించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. . మట్టి మిద్దెల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అల్లా బకాష్ తహసీల్దార్ గోవింద్ సింగ్ కోరారు. సచివాలయం, రెవెన్యూ ఉద్యోగులు పరిస్థితులను గమనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు..

## పాత పెన్షన్‌తోనే భద్రత




ఆదోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

**ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 1:** పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఆదివారం నూతన పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. డీటీ రామేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజమౌళి, సుదర్శన్ రెడ్డి, ఓబులేషు, సుబ్బారెడ్డి, తిక్కస్వామి, నాయక్, నారాయణ, వెంకటరెడ్డి, నల్లన్న, బీరప్ప, సంగమేశ్, పార్థసారథి, రాఘవేంద్ర, రవి భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు టౌన్/రూరల్:** కొత్త పెన్షన్ విధానం వచ్చి 20 సంవత్సరాలు కావడంతో విద్రోహ దినంగా పాటిస్తూ కర్నూలులో జరిగే సీపీఎస్ వ్యతిరేక నిరసన కార్యక్రమానికి ఎమ్మిగనూరు నుంచి ఎస్టీయూ నాయకులు బయలుదేరారు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బసవరాజు, ప్రసన్నరాజు, శేఖర్, ఎల్లప్ప పాల్గొన్నారు. పట్టణంలో ఏపీటీఎఫ్ నాయకులు రవి, భీమేష్, బాబు, రామయ్య, నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ ఆదర్శంలో గాంధీ సర్కిల్‌లో నిరసన తెలిపారు. రామన్న, టీచర్ దొడ్డిమేకల వీరేష్, సోమేశ్వరమ్మ, అనిత, కృష్ణగిరి తదితరులు పాల్గొన్నారు.

## పీఠాధిపతికి తులాభారం



పీఠాధిపతికి తులాభారం వేస్తున్న భక్తులు

**మంత్రాలయం, సెప్టెంబరు 1:** మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు కర్ణాటక హుబ్లీకి చెందిన గోపాల్, పురోహిత్ కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి తులాభారం చేశారు. మఠం ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై ఒక వైపు పీఠాధిపతిని కూర్చోబెట్టి, మరో వైపు ప్రసిద్ధి చెందిన దార్వాడపేడ మిఠాయిల బాక్సులతో తులాభారం చేశారు. అనంతరం పీఠాధిపతిని పుష్పాలతో అభిషేకించారు. భక్తులను ఆకట్టుకుంది. తులాభారం చేసిన వారికి పీఠాధిపతి ఆశీస్సులు అందజేశారు. మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపి నరసింహమూర్తి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- డీఎంహెచ్‌వో భాస్కర్
వెల్దుర్తి ఆసుపత్రి తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

**వెల్దుర్తి, సెప్టెంబరు 1:** వర్షాలు కురుస్తు న్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని జాగ్రత్త వహించాలని డీఎంహెచ్‌వో భాస్కర్ అన్నారు. ఆదివారం వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగుల వివరాలను, డాక్టర్లు అందిస్తున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. స్టెతస్కోపు చేతపట్టి రోగులను పరీక్షించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు ప్రబలి మలేరియా, డెంగీ, చికున్ గన్యా, విషజ్వరాలు వస్తాయని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాని, కాచి వడపోసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని హెల్త్ సూపర్‌వైజర్లకు సూచించారు. వైద్యులు చిన్న రంగస్వామి, నవీన్ కుమార్, భువనచంద్ర, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## మంత్రాలయం ఎమ్మెల్యే పూజలు



ఆలయం వద్ద ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

**దేవనకొండ, సెప్టెంబరు 1:** కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయాన్ని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో ఆలయానికి వస్తానని తెలిపారు. ఆయనకు చైర్మన్ హనుమంతరెడ్డి స్వాగతం పలికి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వైసీపీ నాయకులు దివాకర్‌నాయుడు ఎమ్మెల్యేను సన్మానించారు. మంత్రాలయం ఎంపీపీ గిరిజమ్మ, ప్రదీప్‌కుమార్ రెడ్డి, భీమిరెడ్డి ఉన్నారు.

# ఆదోనిలో ఫ్లెక్సీల కలకలం

- అధికారులు, బాలకృష్ణ అభిమానుల వాగ్వాదం



వాగ్వాదానికి దిగిన బాలకృష్ణ అభిమానులు

**ఆదోని, సెప్టెంబరు 1:** సినీనటుడు, ఎమ్మెల్యే బాలక్రిష్ణ సినీరంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభిమానులు పట్టణంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటికి అనుమతి లేదని మున్సిపల్ అధికారులు తొలగిస్తుండగా అభిమానులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులకు, అభిమానులకు మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. పట్టణ నందమూరి బాలక్రిష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు సజ్జద్ హుసేన్ మాట్లాడుతూ పట్టణంలో వందలాది ఫ్లెక్సీలు ఉన్నాయని వాటికి లేని అనుమతి సమస్య బాలక్రిష్ణ ఫ్లెక్సీలకు మాత్రమే ఎందుకు వర్తిస్తుందని ప్రశ్నించారు. ఓ నాయకుడి ఫొటో లేకపోవడంతో తొలగించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని, రాజకీయాలతో సంబంధం లేనిదన్నారు. మున్సిపల్ అధికారితో ఫోన్‌లో ప్రస్తావించగా, దురుసుగా సమాధానమిచ్చినట్లు ఆరోపించారు. ఖాజా, సలకలకొండ ప్రతాప్‌రెడ్డి, ఖాసిం, రామాంజి, గౌరి శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

## విజన్ ఉన్న నాయకుడు

**ఆలూరు, సెప్టెంబర్ 1:** సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా దృఢ సంకల్పంతో ముందుకు సాగారని 14 ఏళ్లకు పైగా ముఖ్యమంత్రిగా సేవలందించారని అన్నారు.

## సమర్థవంతమైన నాయకుడు

**దేవనకొండ, సెప్టెంబరు 1:** సీఎం చంద్రబాబు సమర్థవంతమైన నాయకుడని టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, మలకన్న అన్నారు. సీఎంగా చంద్రబాబు మూడు వసంతాలు పూర్తి చేసుకొవడంతో హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ భర్త బండ్లయ్య, రాజాసాబ్, మురళి, బాలరంగడు, గోవిందు రాజులు, తదితరులు ఉన్నారు.

# రైతులను పట్టించుకోని వైసీపీ

- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 1:** గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డును, రైతులను ఏమాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం వ్యసాయ మార్కెట్‌ను తనిఖీ చేశారు. మార్కెట్ యార్డులో దుకాణాలను, గోడౌన్, ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ ఆవరణలో గత కొంతకాలంగా నిర్వహిస్తున్న కూరగాయల హోల్ సేల్ దుకాణాలను పరిశీలించారు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులతో మాట్లాడారు. వేరుశనగ దిగుబడి తెచ్చిన ఎర్రకోట గ్రామ రైతు నరసింహులుతో మాట్లాడారు. వర్షానికి వేరుశనగ తడిచిందని, నష్టం వస్తుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ మార్కెట్‌లో అభివృద్ధి చేయలేదని, రైతు భరోసా అంటూ రైతులకు ఎలాంటి మేలు చేయకపోగా నాశనం చేసిందని అన్నారు. యార్డులో రైతులకు సౌకర్యాలపై అధికారులతో చర్చించి మంత్రి దృష్టికి తీసుకెళతామని అన్నారు. మిర్చి దిగుబడుల నిల్వకు కోల్డ్ స్టోరేజ్ గోడౌన్‌ను నిర్మించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి క్రయవిక్రయాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామ న్నారు. తమది రైతు ప్రభుత్వమని, రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటామఇ అన్నారు. గత ప్రభుత్వం కరోనా సమయంలో కూరగాయల హోల్ సేల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయడంతో పత్తి క్రయవిక్రయాల కు ఇబ్బందిగా మారిందని అనానరు. రెండు మూడు రోజుల్లో చర్చించి ఎవరికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. యార్డు సెక్రటరీ పద్మావతి, కమీషన్ ఏజెంట్లు ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, జగన్నాథరెడ్డి, బాబు, బందా, రఘు, శ్రీకాంత్, కాకర్ల శ్రీనివాసులు,వడ్డే కృష్ణ, కూరగాయల వ్యాపారులు బీఆర్‌కే రామకృష్ణ, నాయకులు రంగన్న, హనుమంతు, జగదీష్ పాల్గొన్నారు.

# ఘనంగా రైతాంగ కోరికల దినోత్సవం



పత్తికొండలో జెండా ఆవిష్కరిస్తున్న రామచంద్రయ్య

**ఎమ్మిగనూరు(రూరల్), సెప్టెంబరు 1:** పట్టణంలోని ఏఐకేఎస్ కార్యాలయంలో ఆదివారం రైతాంగ కోరికల దినోత్సవ వేడుకలను ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐకేఎస్ జెండాను రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు ఆవిష్కరించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పని చేస్తూ రైతాంగ సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. ఇప్పటికీ దేశంలో 60 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సన్న, చిన్నకారు రైతులకు మిగులు, బంజరు భూములను అందించి సాగునీటి వసతి, ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. జబ్బార్, శాంతప్ప, విరుపాక్షి నాయుడు, మల్లికార్జునగౌడు, రవికుమార్ పాల్గొన్నారు.

**దేవనకొండ:** సీపీఐ కార్యదర్శి నర్సారావ్, నాగరా జు, కిష్టన్న, రాజశేఖర్, రవి, భాస్కర్ పాల్గొన్నారు.

**పత్తికొండ టౌన్:** రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రత్యేక చట్టం తేవాలని రైతు సంఘం గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. రైతు కోరికల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండగేరిలో రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, సీపీఐ కార్యదర్శి రామాంజనేయులు, ఎంకే సుంకన్న, నాగిరెడ్డి, రామచంద్ర, శ్రీరాములు, రవి పాల్గొన్నారు. పెద్దహుల్తి గ్రామంలో గౌరవాధ్యక్షులు కారన్న, దూదేకొండలో వీరన్న రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు.

**పెద్దకడుబూరు:** సీపీఐ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ ఆంజనేయులు, హనుమంతు, లక్ష్మన్న, హుసేని, ముక్కన్న, గిడ్డయ్య, నాగరాజు, భీమయ్య పాల్గొన్నారు

**తుగ్గలి:** పెండేకల్ ఆర్ఎస్, రాంపల్లి తదితర గ్రామాల్లో రైతుల కోరిక దినోత్సవం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను నట్టేట ముచగా, టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి సాయం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు రామానాయుడు, చదువుల కాశీ, ప్రతాప్, రామిరెడ్డి, చిరంజీవి, లాలెన్న తదితరులు పాల్గొన్నారు.

**వెల్దుర్తి:** సీపీఐ కార్యదర్శి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి రాజు ఏఐటీయూసీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. యేసన్న, గిరిబాబు, చిన్న మాదులు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**నందవరం:** రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు గిడ్డయ్య, శాంతన్న, ముని, నాగన్న, రామలింగుడు, మల్లేష్ పాల్గొన్నారు.

**ఆలూరు రూరల్:** సీపీఐ కార్యదర్శి రామాంజనేయులు, రైతు సంఘ మండల కార్యదర్శి చాపాల గోపాల్ రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి చాపాల గోపాల్, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి శివ, మల్లికార్జున, ఓబులేషు, రాముడు, పరుశురాముడు, వీరేష్, రైతులు పాల్గొన్నారు.

**కోసిగి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలని రైతు సంఘం తాలుకా అధ్యక్షులు సీపీఐ కార్యదర్శి ఎం.గోపాల్ అన్నారు. రైతులు రాజు, లక్ష్మన్, నరసింహులు తదితరులు ఉన్నారు.

## వివాహిత అదృశ్యం

**ఆదోని, సెప్టెంబరు 1:** పట్టణంలో వివాహిత అదృశ్యం కావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని ఓ కాలనీలో తమ కుమార్తె కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆమె ఇంటిపక్కనే ఉన్న వైసీపీ కౌన్సిలర్ కూడా కనిపించడం లేదు. దీంతో సదరు కౌన్సిలర్‌పై బాధితురాలి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రేమ పేరుతో వంచించి తమ కుమార్తెను తీసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా మహిళ కనిపించడం లేదంటూ కేసు నమోదు చేసుకున్నారు. ఈ విషయంపై వన్‌టౌన్ సీఐ శ్రీరామ్‌ను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## నేడు మార్కెట్ కమిటీకి సెలవు

**ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 1:** వ్యవసాయ మార్కెట్ కమిటీకి సోమవారం అమావాస్య సెలవు ఉంటుందని, కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. రైతులు దిగుబడును విక్రయానికి తీసుకురావద్దని కోరారు. మంగళవారం మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు జరుగుతాయని అన్నారు. వేరుశనగ, పత్తి ఇతర దిగుబడులను ఇంటి వద్దనే ఆరబెట్టుకొని రావాలని గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.

## 'నేను ఎవరి వద్ద డబ్బు తీసుకోలేదు'

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 1:** బ్యాంకులో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద అప్పు మాఫీ చేయిస్తానని ఎవరి వద్ద తాను డబ్బు తీసుకోలేదని టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ కొమ్ము రాజు అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ఆరోపణలు చేసిన సూగూరు నాగేశ్‌కు తనకు ఎలాంటి లావాదేవీలు లేవన్నారు. సూగూరు నాగేశ్ 25ఏళ్ల క్రితం బ్యాంకులో మార్టిగేజ్ కింద రూ.75వేల రుణం తీసుకున్నారన్నారు. ఇప్పటికి రూ. 9,11,522లు అయిందని డిక్రీ అయ్యిందన్నారు. తనను సంప్రదించగా సీఈఓను కలవాలని చెప్పానన్నారు. ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేయాలనుకుంటున్నానన్నారు.

## హామీలను నెరవేర్చాలి

**మంత్రాలయం, సెప్టెంబరు 1:** ఎన్నికల ముందు చంద్రబాబు పవన్ కళ్యాణ్, లోకేశ్ వడ్డెరులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేష్ మౌర్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ వడ్డెర సంఘం గౌరవాధ్యక్షులు వడ్డెర నారాయణతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

## సీతారాం సిత్రాలు బృందం సందడి

**ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 1:** పట్టణంలో ఆదివారం సీతారాం సిత్రాలు సినీ బృందం సందడి చేసింది. మినీ శ్రీనివాస థియేటర్‌లో దర్శకుడు నాగ శశిధర్ రెడ్డి, హీరో లక్ష్మణ మూర్తి, నిర్మాత, పాటల రచయిత కృష్ణా చంద్రవిజయబట్టు ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని చూశారు. నిర్మాతలు నాగిరెడ్డి, రూపా జగదీష్, నటుడు అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

## సేవాభావం కలిగి ఉండాలి

**ఆదోని టౌన్, సెప్టెంబరు 1:** ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని బీజేపీ నాయకుడు విట్టా రమేష్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డా. గోపీనాథ్ అన్నారు. మదర్ సర్వీస్ సొసైటీ (విజయవాడ) సంస్థ నుంచి ఎన్‌టీఆర్ జాతీయ అవార్డును అందుకున్న వంకదారు శ్రీనాథ్ గుప్తాను ఆదివారం సన్మానించారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) సంఘం, ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ (వామ్) వివిధ సామాజిక వర్గాలకు చెందిన పెద్దలు, స్వచ్ఛంద సంస్థల వారు ఆయనను అభినందించారు.

## పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలి

**ఎమ్మిగనూరు టౌన్,సెప్టెంబర్ 1:** పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలిపారు. రమేష్, రంగస్వామి, అబ్దుల్లా పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

**పెద్దకడుబూరు, సెప్టెంబరు1:** జాలవాడి గ్రామ సమీపంలోని నరసప్ప ఆలయం వద్ద పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## రాజగోపుర నిర్మాణానికి విరాళం

**కౌతాళం, సెప్టెంబరు 1:** ఉరుకుంద ఈరన్న రాజగోపుర నిర్మాణానికి ఓ భక్తుడు రూ.లక్ష విరాళమిచ్చినట్లు ప్రత్యేకాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. ఆదోని వాస్తవ్యులు మంజుల దేవి, మోహనకృష్ణ రూ.1,01,116 నగదును సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు.